

రాజన్న ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

## సెప్టెంబర్ ఒకటి నుంచి
# పశువుల లెక్క

- నాలుగు నెలలపాటు పశుగణన సర్వే
- నేడు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ
- ఏర్పాట్లు పూర్తి



**కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు 21వ పశుగణనకు సర్వం సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వరకు నాలుగు నెలలపాటు సర్వే చేపట్టనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 101మంది ఎన్యుమరేటర్లు, పర్యవేక్షణ కోసం 30మంది వైద్యులకు బాధ్యతలు అప్పగించారు. గణన ఏ విధంగా చేపట్టాలో గురువారం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.**

కరీంనగర్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ఐదేండ్లకోసారి పశుగణన నిర్వహిస్తున్నది. 2018లో చివరిసారిగా 20వ పశుగణన చేపట్టింది. ఈ లెక్కన 2023లోనే పశుగణన చేపట్టాల్సి ఉండేది. కానీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసింది. ఏడాది ఆలస్యంగా ఇప్పుడు చేపడుతున్నది. కరీంనగర్ జిల్లాలో పశు సంవర్ధకశాఖ పరిధిలో 313 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో డీవీహెచ్, ఏవీహెచ్‌తోపాటు 37ఎస్‌సీ ఏహెచ్‌లు, 4 ఎంవీసీఎస్‌లు, 34 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో ఉన్న ప్రతి పశువును గణన చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

### 2018లో 18,24,871పశు సంపద

చివరిసారిగా 2018లో పశుగణనలో చేపట్టారు. అప్పుడు 82,412 తెల్లజాతి పశువులు, 95,344 నల్ల జాతి పశువులు, 6,38,706 గొర్రెలు, 92,687మేకలు, 6,573 పందులు కలిపి కరీంనగర్ జిల్లాలో మొత్తం 18,24,871 పశు సంపద ఉన్నట్లు తేల్చారు. ఇంకా దేశీయ కోళ్లు, ఫౌల్ట్రీ కోళ్లు, బాతులు, కుందేళ్లు, కుక్కలు, పిల్లులు, గాడిదలు, గుర్రాలు, పావురాలు, నెమళ్లు, చిలుకలను కూడా లెక్కిస్తారు. పశువుల్లో ఆవులు, ఎద్దులు, బర్రెలు, దున్నపోతులు ఇలా విడివిడిగా లెక్కిస్తారు. వీధి పశువులను కూడా లెక్కించనున్నారు.

### గణన మొత్తం ఆన్‌లైన్‌లోనే..

ఈ సారి పశుగణన పూర్తిగా ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు ట్యాబ్ ఇస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ లో 71 కాలంతో కూడిన ఫార్మెట్‌ను అందుబాటులో ఉంచారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికెళ్లి పశువులు, పెంపుడు జంతువులు, పక్షులు, దేశీయ, ఫౌల్ట్రీ కోళ్లను లెక్కిస్తారు. ఇలా ప్రతిదీ లోకేషన్‌లో ఉండి అప్‌లోడ్ చేసి సూపర్‌వైజర్లకు పంపిస్తారు. సూపర్‌వైజర్లుగా ఉన్న పశు వైద్యులు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. నాలుగు నెలలపాటు పశుగణన జరుగుతుంది. సూపర్‌వైజర్లు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయగానే కేంద్ర, రాష్ట్ర స్థాయిలోని ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లిపోతుంది. ప్రతి ఎన్యుమరేటర్ 1,500గృహాల్లో ఈ గణన చేపట్టాల్సి ఉంటుంది.

### శిక్షణ తర్వాత గణన

జిల్లాలో పశుగణన చేపట్టే పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందికి నేడు కరీంనగర్‌లో ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పశువుల వివరాలు అప్‌లోడ్ చేసే విధానంపై 101మంది ఎ న్యుమరేటర్లు, 30మంది సూపర్‌వైజర్లకు ట్రైనింగ్ ఇస్తారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు ఈ గణన చేపట్టనున్నారు.

### పకడ్బందీగా చేపడుతాం

జిల్లాలోని పశువులు, కోళ్లు, పెంపుడు జంతువులు, పక్షులను గణించేందుకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. వచ్చే నెల 1నుంచి ఈ గణన ప్రారంభిస్తున్నాం. ఇందుకోసం 101మంది ఎన్యుమరేటర్లు, 30మంది సూపర్‌వైజర్లను నియమించాం. వీరికి నేడు (గురువారం) శిక్షణ ఇస్తున్నాం. పశుగణన పకడ్బందీగా చేపడుతాం. జిల్లాలో మునుపటి కంటే ఈ సారి పశువుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది.

**- పీ శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి పశు వైద్యాధికారి (కరీంనగర్)**



వేములవాడలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



కార్యాలయంలో కిటికీ పక్కన ఉన్న రికార్డులు

# రికార్డులకు చెదలు

- వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సక్రమంగా లేని ఫైల్స్
- బాధ్యతలు చేపట్టేందుకు ముందుకురాని అధికారులు
- నెలరోజులుగా ఇన్‌చార్జితోనే సరి

**వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భద్రపరిచిన రికార్డులకు చెదలు పట్టింది. సబ్‌రిజిస్ట్రార్ ఈ నెల ఒకటిన బదిలీ కాగా, కరీంనగర్ డీఐజీ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వం ఇన్‌చార్జిగా నియమించింది. రికార్డు గదిని పరిశీలించిన సదరు అధికారి.. డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడం, వాటికి చెదలు పట్టి ఉండడాన్ని గమనించి ఇక్కడ బాధ్యతలు తీసుకునేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. సెలవుల పేరుతో ఆయన కాలయాపన చేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.**

వేములవాడ, ఆగస్టు 28 : వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1982లో ప్రారంభమైంది. అప్పటి నుంచి మాన్యువల్ పద్ధతిలోని రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది. 2000 తర్వాత కంప్యూటర్ సేవలు అందుబాటులోకి రాగా, ప్రతి రికార్డును డిజిటల్ రూపంలో భద్రపర్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. 2000కి ముందు 18ఏండ్ల కాలపరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను కాగితాల రూపంలో రికార్డుగదిలో భద్రపరిచారు. ప్రస్తుతం ఆ రికార్డుల ప్రక్రియ సక్రమంగా లేదని, వాటిలో కొన్నింటికి చెదలు పట్టినట్లు తెలిసింది.

### రికార్డులే కీలకం

కార్యాలయంలో ప్రతి రికార్డును భద్రపరిచే బాధ్యత సబ్‌రిజిస్ట్రార్‌పై ఉంటుంది. భవిష్యత్తులో కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఎదురయ్యే సమస్యలకు రికార్డులు కీలకం. అయితే వేములవాడలో ఏడాదికి 10వేలకు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కార్యాలయంలోని రికార్డులు సక్రమంగా లేకపోవడం, కొన్నింటికి చెదలు పట్టడంతో వేములవాడలో బాధ్యతలు తీసుకునేందుకు వచ్చిన సదరు అధికారి.. సెలవు పేరుతో కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కరీంనగర్ డీఐజీ రవీందర్ తనిఖీ చేశారు.

### 13 కార్యాలయాలకు.. ఏడుగురు ఇన్‌చార్జిలే

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిస్ట్రార్ల బదిలీలు జరిగాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉండగా, ఏడు కార్యాలయాల్లో ఇన్‌చార్జిలతో కాలంవెల్లదీస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం




వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులకు చెదలు పట్టిన విషయం నా దృష్టికి రాలేదు. రికార్డుల ప్రక్రియ సరిగ్గా లేకపోయినా.. చెదలు పట్టినా.. సదరు అధికారిపై చర్యలు తీసుకుంటాం. మరో 20రోజుల్లో పూర్తిస్థాయిలో సబ్‌రిజిస్ట్రార్‌ను వేములవాడకు కేటాయిస్తాం.

**- రవీందర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ (కరీంనగర్)**

## ఒకటిన ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

కొత్తపల్లి, ఆగస్టు 28 : కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటో తేదీన కరీంనగర్ ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. మానకొండూర్ మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్, పుట్టిన తేది ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని సూచించారు. 2010 అక్టోబర్ 3 తర్వాత జన్మించి, 14 ఏండ్లలోపు వయసు ఉన్న వారు అర్హులన్నారు. ప్రతిభచూపిన వారిని వచ్చే నెల 13 ,14 ,15 తేదీల్లో ఖమ్మంలో జరిగే 34వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు పంపిస్తామని చెప్పారు.

# కింకర్తవ్యం ?



## పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దారెటు?

- రాజకీయ ప్రత్యర్థి చేరికతో అంతర్మథనం
- సీనియర్ నేతను కాదని కొత్తగా చేరిన వారికే రేవంత్‌వర్గం ప్రాధాన్యం
- రోజురోజుకూ శ్రేణుల్లో అయోమయం
- నామినేటెడ్ పోస్టుల భర్తీకి చేసిన సిఫారసులు బుట్టదాఖలు
- జీవన్‌ను సాగనంపేందుకు ఓ ప్రజాప్రతినిధి పావులు!
- సదరు వ్యక్తిపై జీవన్ వర్గీయుల గుస్సా
- పదవికి, పార్టీకి రాజీనామా యోచనలో పెద్దమనిషి?

**నలభైనాలుగేండ్ల రాజకీయ జీవితం.. కాంగ్రెస్‌తో నాలుగు దశాబ్దాలుగా సుదీర్ఘ అనుబంధాన్ని కొనసాగిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి పార్టీలో ప్రాభవం తగ్గిపోయిందా..? ఇన్నాళ్లు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న ఓ నేత చేరికతో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారా..? ఉత్తర తెలంగాణలోని నాలుగు జిల్లాల్లో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న తనను కాదని కొత్తగా చేరిన ఎమ్మెల్యేకే రేవంత్‌వర్గం ప్రాధాన్యం ఇస్తుండడంతో అంతర్మథనంలో పడిపోయారా..? అంటే ఇటీవల పరిణామాలు చూస్తే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఎన్నికల్లో గెలిచినా.. ఓడినా.. జగిత్యాల కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి! జీవన్‌రెడ్డి అంటే జగిత్యాల కాంగ్రెస్ అన్న పేరు ఉండేది! రాజకీయంగా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా జయాపజయాలు ఎదురైనా, పరిస్థితులు ఏవైనా తన రాజకీయ ప్రస్తానాన్ని కొనసాగిస్తూనే ఉన్న ఆయన, నేడు సొంత పార్టీ నాయకులు ఆడుతున్న కుటిల ఆటతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలుస్తున్నది. పార్టీలో ఏండ్లపాటు పనిచేస్తున్న నాయకులకు నామినేటెడ్ పోస్టుల భర్తీకి జీవన్‌రెడ్డి చేసిన సిఫారసులు బుట్టదాఖలు కావడం, అలాగే ఆయన్ను సాగనంపేందుకు ఓ ప్రజాప్రతినిధి పావులు కదుపుతుండడంతోనే రాజీనామా చేసే ఆలోచనల్లో ఉన్నట్టు తెలుస్తున్నది.**

జగిత్యాల, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): పదేండ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జగిత్యాల నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు నామినేటెడ్ పోస్టులు వస్తాయని ఆనందించారు. జగిత్యాల నియోజకవర్గంలో పార్టీని నమ్ముకొని కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు నామినేటెడ్ పదవులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గతంలోనే సిఫారసు చేశారు. 35 ఏండ్లుగా పార్టీలో పనిచేస్తూ, ఇంత వరకు ఒక్క నామినేటెడ్ పోస్టు సైతం పొందని దళిత వర్గానికి చెందిన నాయకుడి పేరును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి సిఫారసు చేసినట్లు సమాచారం. ప్రత్యర్థులు పలు కేసులు పెట్టినా, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన నాయకుడిని జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, ఓ యువకుడిని రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి ఐదారు నెలల క్రితమే సిఫారసు చేశారు. అయితే ఓ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిన తర్వాత సీన్ మారినట్లు సమాచారం. ఎమ్మెల్యే తనకు సంబంధించిన వారి పేర్లను సిఫారసు చేయడంతో జీవన్‌రెడ్డి సిఫారసు చేసిన జాబితా బుట్టదాఖలైనట్టు తెలుస్తున్నది.

### ఎవరి దారి వారిదే...

జగిత్యాలలో చిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇద్దరూ అధికార పార్టీలోనే కొనసాగుతున్నా ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీకి సంబంధించిన ఏ ఒక్క కార్యక్రమంలో ఇద్దరు నాయకులు కలిసి పాల్గొనడం లేదు. ఒక రకంగా చెప్పాలంటే ఇప్పటి వరకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తిగా వ్యవహరించిన దాఖలాలు లేవు. రైతు రుణమాఫీని ప్రకటించిన సమయంలో జగిత్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడంతో పాటు, సంబురాలు నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం మొత్తం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే జరిగింది. ఎమ్మెల్యే ఎక్కడా పాల్గొనలేదు. అలాగే పార్టీకి సంబంధించిన ఏ ఇతర కార్యక్రమాల్లోనూ ఎమ్మెల్యే పాల్గొనకపోవడం గమనార్హం. ఇక అధికార కార్యక్రమాలతో పాటు, ఇతర అన్ని అంశాల్లోనూ ఒకరు తూర్పుకు వెళితే మరొకరు పశ్చిమానికి ప్రయాణిస్తున్నారు. ఐటీఐ విభాగానికి సంబంధించిన నిర్మాణాన్ని ధరూర్ క్యాంపులోని ఎస్సారెస్పీ స్థలంలో నిర్మించాలని ఎమ్మెల్సీ ప్రతిపాదించగా, ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది.

### సీఎం వర్గంలో ఎమ్మెల్యే, సీనియర్ల వర్గంలో ఎమ్మెల్సీ

జగిత్యాలలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇద్దరు కాంగ్రెస్ పార్టీ గ్రూప్ రాజకీయాల్లో తలా ఓవైపు చేరిపోయినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే పూర్తిగా సీఎం వర్గం మనిషిగా చెలామణి అవుతున్నారు. ఇక ఖమ్మం జిల్లాకు చెందిన ఒక రాజకీయ వేత్త, మంత్రితో ఎమ్మెల్యే సమీప బంధువుకు దగ్గరి సంబంధాలు ఉండడంతో ఆయన ద్వారా కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేకు సదరు మంత్రి పూర్తిస్థాయి మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తున్నది. పార్టీ కండువా కప్పుకోగానే, సదరు మంత్రి జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేకే ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి చెప్పినట్లు ప్రచారం జరుగుతున్నది. ఎమ్మెల్యే సైతం తాను పాల్గొన్న ప్రతి సభ, సమావేశంలో, సీఎం పేరుతో పాటు సదరు మంత్రి సహాయ సహకారాలతో జగిత్యాలకు నిధులు తెస్తానని, సదరు మంత్రి త్వరలోనే జగిత్యాలకు వస్తాడని ప్రస్తావిస్తుండడం గమనార్హం. ఇక ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కాంగ్రెస్‌లోని సీనియర్ల సపోర్ట్ ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఇదివరకే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానన్న సమయంలో సీనియర్లు డిప్యూటీ సీఎం భట్టి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలుగ చేసుకొని సమస్యను తాత్కాలికంగా పరిష్కరించిన విషయం తెలిసిందే. ఇప్పుడు సైతం అదే పరిస్థితి కొనసాగుతున్నది. ఇటీవలే మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను డిప్యూటీ సీఎం భట్టి పరిశీలించడానికి వచ్చిన సమయంలో వర్గపోరు బహిర్గతమైందంటున్నారు. డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీకి ప్రాధాన్యత ఇచ్చారని, ఇది నచ్చక భట్టికి ఎమ్మెల్యే బోకె ఇచ్చి రెండు నిమిషాల్లోనే వెనుదిరిగారని చెబుతున్నారు. స్వాతంత్ర దినోత్సవం కార్యక్రమంలోనే వర్గపోరు కనిపించిందంటున్నారు. ఒక అధికారి ఇంట్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అల్పాహారం తీసుకొని, ఒకే వాహనంలో పరేడ్ గ్రౌండ్‌కు వచ్చారని, దీంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నొచ్చుకున్నాడన్న మాటలు వినిపిస్తున్నాయి. పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఎగురవేసిన తర్వాత పోలీసు గౌరవ వందన సమయంలో విప్‌ను ఎమ్మెల్సీ కనీసం పట్టించుకున్నట్లు కనిపించలేదని, అర్ధంతరంగానే సభ నుంచి ఎమ్మెల్సీ వెళ్లిపోయారని అంటున్నారు. ఎమ్మెల్యే కొంత ఎమ్మెల్సీతో గ్యాప్ ఉన్న వారిని ఎంచుకొని, వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తానని ఆకర్షించే ప్రయత్నంతోపాటు వారి ఇంటికి వెళ్లి కలుస్తున్నట్లు ఎమ్మెల్సీ వర్గం ఆరోపిస్తున్నది. ఇటీవలే మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటికి వెళ్లి జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుకు పేరు సిఫారసు చేశానని, ఎమ్మెల్యే చెప్పినట్టు వార్తలు బయటకు రావడంతో సదరు నాయకుడిని ఎమ్మెల్సీ వర్గం పూర్తిగా పక్కకు పెట్టినట్లు తెలుస్తున్నది. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంపిక సమయంలో ఎమ్మెల్యేతో విబేధించి రెబల్‌గా మారి పదవి దక్కించుకొని, తర్వాత కాంగ్రెస్‌లో చేరిన ఒక ప్రజాప్రతినిధిని సైతం ఎమ్మెల్యే మళ్లీ నిధులు ఇస్తాను, ఇప్పిస్తాను అంటూ దగ్గర చేసుకునే ప్రయత్నం చేస్తుండడాన్ని ఎమ్మెల్సీ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ ఇంటిపై వాలిన కాకి, ఈ ఇంటిపై వాలడానికి వీలు లేదన్నట్లుగా వ్యవహారం సాగుతున్నది.

### ఎమ్మెల్సీని సాగనంపేందుకు వ్యూహరచన ?

ఎమ్మెల్సీని పార్టీ నుంచి సాగనంపేదుకు జిల్లాకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి వ్యూహ రచన చేస్తున్నాడన్న పుకార్లు వినిపిస్తున్నాయి. పలుసార్లు ఓటమి పాలైనప్పటికీ సదరు ప్రజాప్రతినిధికి ఎమ్మెల్సీ రాజకీయంగా అండగా నిలిచారు. ఒకానొక దశలో పార్టీలో కీలక పదవిని ఆయనకు కట్టబెట్టేలా చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు ప్రజాప్రతినిధి వ్యవహారశైలి తీవ్ర విమర్శల పాలవుతున్నది. ఎమ్మెల్సీ పార్టీలో ఉన్నంత కాలం, తాను వెనుక వరుసలో నిలబడే ఉండాల్సి వస్తున్నదని, సీనియర్‌ను తప్పిస్తేనే తనకు ప్రాధాన్యత పెరుగుతుందన్న భావంతోనే ఆయన కుట్రలు చేస్తున్నట్టుగా కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్సీ ప్రాధాన్యతను తగ్గించేందుకు సదరు ప్రజాప్రతినిధి, ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చేందుకు పావులు కదిపినట్టు చెబుతున్నారు. పార్టీలో చేరిన ఎమ్మెల్యేకు ప్రతి విషయంలోనూ సదరు ప్రజాప్రతినిధి అండగా నిలబడుతుండడం, ఎమ్మెల్యే సైతం సదరు ప్రజాప్రతినిధితోనే తిరుగుతుండడాన్ని కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోవడం లేదు. కష్టాల్లో ఉన్నప్పుడు కాపాడిన ఎమ్మెల్సీకే సున్నం పెట్టాలని చూస్తున్న సదరు ప్రజాప్రతినిధిపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే ఆలోచన?

కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులు, 40 ఏండ్ల సీనియార్టీకి విలువ లేకపోవడం, తనకు కనీస గౌరవం ఇవ్వకపోవడం, ప్రతి విషయంలోనూ అడ్డంపడడం, అలాగే తనను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయలేని పరిస్థితులు ఉత్పన్నం కావడంతో తీవ్ర ఆవేదనకు గురైన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పదవికి, అవసరమైతే పార్టీకి రాజీనామా చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. తన నిర్ణయ పర్యవసానాలు, అనంతర ఎదురయ్యే ఇబ్బందులు, రాజకీయంగా తీసుకోవాల్సిన చర్యలు, తన వర్గం రాజకీయ భవిష్యత్తు తదితర అంశాలన్నింటిపై బేరీజు వేసుకుంటూ సన్నిహితులతో చర్చిస్తున్నట్లు సమాచారం.

## కార్తీక మాసం నుంచే
# నిత్యాన్నదానం

వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ, ఆగస్టు 28: రాజన్న ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని వచ్చే కార్తీక మాసం నుంచి ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ప్రతిరోజూ భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే అందుకు భవనాన్ని కూడా నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతామని చెప్పారు. రేషన్‌కార్డు లేని రైతులందరికీ ₹2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని పేర్కొన్నారు. బుధవారం ఆయన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడలో ₹15లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదాం, ₹80.66లక్షలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ భవనాన్ని ప్రారంభించారు. తర్వాత ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 59వేల మంది రైతులకు ₹444కోట్ల విలువైన రుణాలు మాఫీ చేశామన్నారు. ఎక్కడైనా రుణమాఫీ జరగని రైతులుంటే సహకార వ్యవస్థ ప్రభుత్వంతో సమన్వయం చేసి వారికి మాఫీ చేయించాలని కోరారు. రేషన్‌కార్డు లేనివారికి ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ ప్రారంభించిందని, అధికారులు విచారణ చేసిన తర్వాత వారికి కూడా రుణమాఫీ అవుతుందని భరోసానిచ్చారు. సహకార సంఘాల ద్వారా విదేశీ విద్య లోన్లు ఇచ్చే అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానని చెప్పారు. సహకార సంఘం లో కొండూరి రవీందర్‌రావు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. తాను కూడా క్రిబ్‌కో డైరెక్టర్‌గా పని చేశానని గుర్తు చేశారు. రవాణా శాఖ మంత్రిగా ఉండి 265రోజుల్లో 85కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయడం సంతోషంగా ఉందన్నారు. నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ, కేంద్ర సహకార సంఘం బ్యాంక్ 72శాఖలతో రూ.6వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోందన్నారు. ప్రస్తుతం నాబార్డ్ సహకారంతో దేశంలోనే అగ్రగామిగా పని చేస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులకు రుణాలు అందిస్తూనే.. సాగు విధానంలో నూతన ఒరవడిని అందించేవిధంగా వంగడాలను తయారుచేసి ఇవ్వాలన్నారు.



5 లక్షల చెక్కును ఈవోకు అందజేస్తున్న ఈగ రమేశ్

### నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.5లక్షల విరాళం

వేములవాడటౌన్ ఆగస్టు 28 రాజన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు హనుమకొండ జిల్లా నర్సక్కపల్లి వాస్తవ్యులు ఈగ రమేశ్ రూ.5లక్షల విరాళం అందజేశారు. అనంతరం విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ కార్యాలయంలో ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. తర్వాత వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## ఫ్రీ బస్సు తిప్పలు..
## సీట్ల కోసం పాట్లు



బస్సు కిటికిలో నుంచి ఎక్కుతున్న మహిళ

వేములవాడ రూరల్, ఆగస్టు 28: ఆర్టీసీ ఫ్రీ బస్సు స్కీం మహిళలకు తిప్పలు తెచ్చిపెడుతున్నది. ఉచిత ప్రయాణం సంతోషాన్ని ఇస్తున్నా బస్సుల కొరత మాత్రం నరకం చూపిస్తున్నది. అందుకు వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్‌లో బుధవారం జరిగిన ఘటనే నిదర్శనంగా నిలుస్తున్నది. వేములవాడ నుంచి వరంగల్ వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉండగా, బస్సు వచ్చింది. అయితే అందరికీ సీట్లు దొరికే అవకాశాలు లేకపోవడంతో ఓ మహిళ ఇబ్బంది పడుతూ కిటికీలో నుంచి బస్సు ఎక్కింది. ఈ ఘటన మహిళల పాట్లను కండ్లకుగట్టగా, ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేములవాడకు అదనపు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## నాటు తుపాకులతో
# అటవీ జంతువుల వేట

గజసింగవరంలో తయారీదారు, వేటగాళ్ల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, ఆగస్టు 28: నాటు తుపాకుల తయారీదారుతోపాటు వాటితో అటవీజంతువులను వేటాడే ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలం గజసింగవరానికి చెందిన రాయలింగు శంకర్ కొన్నిరోజులుగా నాటు తుపాకులు తయారు చేస్తూ, వేటగాళ్లకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో పక్కా సమాచారం మేరకు బుధవారం రాయలింగు శంకర్ ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. నాటు తుపాకుల తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే నాటు తుపాకులతో అటవీ జంతువులను వేటాడుతున్న రాయలింగు చంద్రమళి, శాతవేణి హరీశ్, గంగయ్యలను అదుపులోకి తీసుకోని వారి వద్ద రెండు తుపాకులు, నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసిన ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రామ్మోహన్, రమాకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571